క్లుప్తంగా

నేడు మండల సమావేశం

కూనవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన గురువారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

చిన్నారులకు ఆటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా బుధవారం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాధికారి శెట్టి సునీత మాట్లాడుతూ శిబిరాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఈనెల 11వ తేదీ వరకు కొనసాగుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం



మొండికోట గ్రామంలో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ మొండికోట గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మట్టి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ఐసరం హనుమంతరావు బుధవారం ప్రారంభించారు. రెండు కిలోమీటర్ల మేరకు మట్టి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. నాయకులు చిరంజీవినాయుడు, మత్స్యకొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం

డుంబ్రిగుడ: పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అరకు నియోజకవర్గ అధ్యక్షుడు మురళీ అన్నారు. మండలంలోని కొర్రాయి, అరకు సంతబయలు గ్రామాల్లో ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్థానిక నాయకులతో కలిసి విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తున్నామన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

అధ్వాన డ్రైనేజీతో అవస్థలు



రహదారిపై మురుగునీరు ప్రవహిస్తున్న దృశ్యం

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో మసీదు రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింది. దీంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని, రాకపోకలకు అవస్థలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఉద్యాన పంటలతో ఆదాయం



రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్న గిరిజన వికాస్ సంస్థ ప్రతినిధులు

గూడెంకొత్తవీధి: ఉద్యాన పంటలతో గిరి రైతులకు ఆదాయం లభిస్తోందని గిరిజన వికాస్ సంస్థ ప్రతినిధులు చిన్న, పురుషోత్తంనాయుడులు అన్నారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో పెదవలసలో రైతులకు గిరిజన వికాస్ సంస్థ ఆధ్వర్యంలో పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలరాజు, రైతులు పాల్గొన్నారు.

‘ప్రకృతి’కి ప్రణామం

- నేల తల్లికి జీవం పోసేలా...
- రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట ఎరువులు
- సేంద్రియ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



వరి నారుమడి కోసం దుక్కు దున్నుతున్న గిరిజన రైతు

రాజవొమ్మంగి: రసాయన ఎరువులతో జవసత్వాలు ఉడిగిపోతున్న నేల తల్లికి తిరిగి జీవం పోసేందుకు రైతులు ముందుకొస్తున్నారు. ఈ మేరకు ప్రకృతి సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

ఓ వైపు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు, రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది. పచ్చిరొట్ట ఎరువుల వాడకం వల్ల సాగుభూమిలో సహజసిద్ధంగా సత్తువ పెరిగి మంచి దిగుబడులు వస్తాయని వివరించడంతో పాటు ఆసక్తి చూపుతున్న రైతులకు నామమాత్రపు ధరకు పచ్చి రొట్ట ఎరువు విత్తనాలను సరఫరా చేస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే ఆయా విత్తనాలను విస్తృతంగా సరఫరా చేస్తోంది. ప్రతి రైతుకు అందేలా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు ప్రకృతి సాగు ప్రాధాన్యంపై అధికారులు అవగాహన కలిగిస్తున్నారు. ఇప్పటికే 200 క్వింటాళ్ల దాయిన్‌చా (జీలుగ), 400 క్వింటాళ్ల సన్‌హీప్ (కట్టె జనుము), 200 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలను సరఫరా చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. వేసవి దుక్కులు పూర్తయిన వెంటనే ఆయా విత్తనాలను పొలాల్లో వెదజల్లుకోవాలన్నారు. పైరు ఏపుగా పెరగగానే, వరి నాట్లు వేసే ముందు దమ్ములో కలియ దున్నాలన్నారు. ఈ ప్రక్రియ వల్ల భూమిలో సహజసిద్ధమైన ఎరువు వద్ధి చెందుతుందని, ఈ విధానం రసాయన ఎరువులు వెదజల్లే పద్ధతికన్నా చౌక, లాభసాటి అన్నారు.

వ్యవసాయశాఖ కసరత్తు

ఎప్పుడెప్పుడు తొలకరి వస్తుందా అని ఎదురుచూసే గిరిరైతును ఆడపాదడపా కురుస్తున్న వాన చినుకులు ఆహ్వానం పలుకుతున్నాయి. నేలతల్లి చల్లబడుతుండటంతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధం రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే పశువుల ఎరువులను తమ కొట్టాల్లోంచి తీసుకొని వెళ్ళి పొలాలకు తీసుకొని వెళ్ళి వెదజల్లుతున్నారు. వెనువెంటనే ఎరువును భూమిలో కలికదున్నుతూ తన పొలం బంగారం పండాలంటూ కోటి ఆశలతో సాగులో అడుగు ముందుకు వేస్తున్నారు. గత ఏడాది లాభం వచ్చిందా నష్టపోయామా అన్న ఆలోచనలను దరికి రాకుండా ఖరీఫ్ వరి సాగు పనులను గిరిరైతు ముమ్మరం చేస్తున్నారు.

పెరుగుతున్న వరి సాగు విస్తీర్ణం

గత ఏడాది జిల్లాలో 54వేల హెక్టార్లలో వరి సాగైనట్టు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది వాతావరణం మరింత అనుకూలంగా ఉండడంతో వరి సాగు విస్తీర్ణం మరీ పెరగవచ్చని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేవలం వరి పంట మాత్రమే కాకుండా సుమారు 2వేల హెక్టార్లలో మొక్కజొన్న, 14వేల హెక్టార్లలో రాగులు, 1700 హెక్టార్లలో సామలు, 2700 హెక్టార్లలో వేరుశనగ, 2600 హెక్టార్లలో పత్తి, 8వేల హెక్టారకు మించి పసుపు సాగవుతోంది.

రైతుకు పూర్తి భరోసా

ప్రభుత్వం ప్రతి ఏటా అందిస్తున్న రైతు భరోసా సొమ్ములు సకాలంలో చేతికి అందుతుండడంతో రైతుల్లో ఆనందం కనుపిస్తోంది. పట్టాభూములు వున్న రైతులకే కాకుండా ప్రభుత్వం గత రెండేళ్ళగా ఆర్ఓఎఫ్ఆర్ (కొండపోడు పట్టాలు వున్నారికి) కూడా రైతు భరోసా సొమ్ములు అందజేస్తుండటంతో మన్యంలో సాగు విస్తీర్ణం రాను రాను పెరుగుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆర్బీకేల ద్వారా విత్తనాల సరఫరా

రైతులకు సకాలంలో వరి విత్తనాల పంపిణీకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అనేక మండలాల్లో ఇప్పటికే విత్తనకిట్ల పంపిణీ చురుకుగా సాగుతోంది. గత ఏడాది 15,690 క్వింటాళ్ళ వరి విత్తనాలను 90 శాతం సబ్సిడీపై గిరిరైతులకు అందజేయగా ఈ ఏడాది కూడా రైతుల అవసరాలను అంచనా వేస్తు 18,384 క్వింటాళ్ళ విత్తనాల సరఫరాను వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకొన్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నంద్ తెలిపారు. ఇందులో ఇప్పటికే 3,991 క్వింటాళ్ళ విత్తనాలను పలు మండలాల్లోని ఆర్బీకేలకు చేర్చడం జరిగిందని అన్నారు. ఈ ఏడాది అధికంగా ఎంఎల్ఆర్ 34449, ఎంటీయూ 1064, ఎంటీయూ 1121, ఎంటీయూ 1318 వరి వంగడాలను రైతులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

నేడు సామాజిక తనిఖీ సదస్సు

గంగవరం: మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ సదస్సును బుధవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ నుంచి మార్చి 31, 2023 వరకు మండలంలో అన్ని గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీ వారీగా నివేదికను మండల స్థాయి సదస్సులో వెల్లడిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది హాజరుకావాలన్నారు.

గడప గడపకు పోస్టల్ సేవలు

చింతూరు: గిరిజన ప్రాంతాల్లో పోస్టల్ సేవలను విస్తృత పరిచేందుకు వన జన్‌ధన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన ప్రాంత ఆర్థిక చేరిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పోస్టల్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నారాయణ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం చింతూరు మెయిన్‌రోడ్‌లో వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్‌శాఖలోని ఇన్సూరెన్సు పథకాలు, అందిస్తున్న సేవలను దుకాణ దారులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ చింతూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని 754 ఆవాసాల్లో 85 వేల గృహాల్లో ప్రతి కుటుంబానికి వందశాతం పొదుపుఖా తా, భీమా పాలసీ ప్రారంభింప చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సత్యప్రకాష్, పోతురాజు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు



బొడ్డాపుట్టులో గ్రామస్తులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



రాజవొమ్మంగిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

హుకుంపేట: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మత్స్యపురం పంచాయతీ బొడ్డాపుట్టు, బందమామిడి, డబ్బాగరువు గ్రామల్లో బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. గ్రామస్తులు ఆయనకు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 193 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. శివారు గ్రామాల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పనకు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సమస్యలను పలువురు విన్నవించగా, త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సొసైటీ బ్యాంకు చైర్మెన్ కె.రామకృష్ణ, సర్పంచ్‌లు పూజారి మేరి, లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యులు కోరాబు నాగలక్ష్మి, కిల్లో మీనా, నాయకులు సుబ్బారావు, కోరాబు వెంకట్, మహేష్, పి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు విశేష స్పందన

పేదల అభ్యున్నతికి పెద్దపీట

రాజవొమ్మంగి: పేదల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, గతంలో ఏ ప్రభుత్వం పేదలకు అందివ్వలేనంత సంక్షేమాన్ని మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అందజేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాజవొమ్మంగి పంచాయతీ కమ్మరిపేట, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో వారు బుధవారం పర్యటించారు. వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లోని 600 గడపలను వారు సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కమ్మరిపేటలో తాగునీటి సమస్యను స్థానికులు విన్నవించారు. దీనిపై స్పందించిన వారు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామంలో చేతి పంపు ఏర్పాటుచేయాలని ఎంపీడీవో బాపన్నదొర, కార్యదర్శి మల్లేశ్వరరావుకు సూచించారు. త్వరలో ఇంటింటికీ తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని వారు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా రాజవొమ్మంగిలోని షిర్డీసాయిబాబా మందిరంలో వారు పూజలు చేశారు.

ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, మండల పార్టీకన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, దాసరి నాగేశ్వరరావు, సవిరెల చంద్రుడు, మిరియాల గణలక్ష్మి, అగూరి శుభలక్ష్మి, భీంరెడ్డి శుభలక్ష్మి, చీడి శివ, సత్యన్నారాయణ, ఎంపీటీసీలు గంగదుర్గ, నిర్మల కుమారి, లోవలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటరమణ, నాయకులు దాట్ల వెంకటేష్ రాజు, అడపా కామేష్, సింగిరెడ్డి రవి, అంకం రవి, మంచికంటి సత్యమూర్తి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు. సీఐ బాజిలాల్, ఎస్ఐలు గోపీ నరేంద్రప్రసాద్, షరీఫ్ సాయుధ పోలీసుల సహాయంతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న చింతపల్లి ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో చింతపల్లి మండల అభివృద్ధికి తమవంతు ప్రయత్నిస్తానని నూతన ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. చింతపల్లి ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అల్లూరి జిల్లాలో పాడేరు తరువాత చారిత్రక నేపథ్యం, పర్యాటక గుర్తింపు ఉన్న ప్రాంతంగా చింతపల్లికి ప్రత్యేకత ఉందన్నారు. తరచూ ఉన్నతాధికారులు, ప్రముఖుల రాకపోకలు ఉంటాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసి మండలానికి మంచిపేరు తీసుకురావాలని ఆమె కోరారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో రవీందర్, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఎంఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పలుశాఖల అధికారులు, ఉద్యోగులు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు హాజరయ్యారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అరకులోయ రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతోందని నేచర్ సంస్థ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ గౌరీ పట్నాయక్ అన్నారు. నేచర్ సంస్థ డైరెక్టర్ వికాష్ బాలరాజు ఆదేశాల మేరకు మండలంలో మారుమూల ఇరగాయి పంచాయతీ కేంద్రంలో వాలీబాల్ క్రీడా పోటీలను సచివాలయం సెక్రటరీ శెట్టి సత్యప్రకాష్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన యువతకు క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. నేచర్ సంస్థ గిరిజన గ్రామల్లో మరింత సేవలు అందించాలని ఆయన కోరారు. క్రీడా పోటీలో ప్రతిభావంతులకు నేచర్ సంస్థ ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తామన్నారు. అప్పలస్వామి, అజయ్, రమణ, లక్ష్మి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులలకు వరి విత్తనాల పంపిణీ



జియ్యంపాలెంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ పద్మావతి , సర్పంచ్‌లు

గంగవరం : రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్దార్థ, ఎంపీటీసీ సభ్యురాలు కుంజం పద్మావతి అన్నారు. జియ్యంపాలెం గ్రామంలో మొల్లేరు సొసైటీ సీఈవో బొల్లవరపు జయరాజు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గిరిజన రైతులకు సబ్సిడీ వరి విత్తనాలను వారు పంపిణీ చేశారు. జియ్యంపాలెం, జగ్గంపాలెం గ్రామ సర్పంచ్‌లు కంగల సుబ్బలక్ష్మి, తుర్రం లీలావతి, సచివాలయ కన్వీనర్ శ్రీను, రాజవరం, జియ్యంపాలెం, రాజవరం పాతవీధి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలి



భక్తులకు ప్రసాదాన్ని అందజేస్తున్న తణుకు వెంకట్రామయ్య

రాజవొమ్మంగి: హిందూ సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అడ్డతీగల పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకట్రామయ్య అన్నారు. మండలంలోని వంచంగి గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన రామాలయాన్ని వెంకట్రామయ్య, విజయలక్ష్మి దంపతులు బుధవారం సందర్శించారు. ఆలయాల్లో నిత్యం పూజలు నిర్వహిస్తుండాలని సూచించారు.

హిందూధర్మ పరిరక్షణ కోసం టీటీడీ ఆధ్వర్యంలోని సమరసతా సేవా ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందని, గ్రామాల్లో దేవాలయాలను నిర్మించడం అభినందనీయమన్నారు. మన గుడి కార్యక్రమం ద్వారా భక్తులకు పూజా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

సాక్షి,పాడేరు: గిరిజన సంక్షేమశాఖలో పదోన్నతులు కల్పించాలని పలువురు అభ్యర్థులు కన్నయ్య, .జోసెఫ్, రాంబాబు, జయలక్ష్మి, కొండబాబు తదితరులు బు ధవారం ఒక ప్రకటనలో పాడేరు ఐటీడీఏ అధికారులను కోరా రు. అన్ని ఐటీడీఏ పరిధిలో గిరిజన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినా పాడేరు పరిధిలో నిర్వహించలేదని పేర్కొన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీవోలు చొరవ తీసుకొని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాయకుడు స్మిత్‌ను పరామర్శిస్తున్న నేతలు

రంపచోడవరం: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మారేడుమిల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు దూడ స్మిత్‌ను సర్పంచ్ మంగా బొజ్జయ్య, జెడ్పీటీసీ సభ్యుడు పండా వెంకటలక్ష్మి తదితరులు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మండల సచివాలయ కన్వీనర్ పండా రామ్కృష్ణదొర, మండల కన్వీనర్, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, సచివాలయం కన్వీనర్ కొండరాజు, రైల్వే బోర్డు సభ్యుడు డొక్కులూరి రామారావు , ఆస్పత్రి డైరెక్టర్ మంగా తమ్మన్న కుమార్, నాయకుడు అనిల్ తదితరులున్నారు.

సెల్ టవర్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న తహసీల్దార్ నర్సమ్మ, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలో గల కింబాయిపుట్టు పంచాయతీ రాములు గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ నర్సమ్మ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ సుభాష్‌చంద్ర తదితరులు భూమి పూజ చేసి పనులను మొదలు పెట్టారు. సెల్ టవర్ పనులు మొదలవ్వడంతో రాములు గ్రామ గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శ

కొయ్యూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె రాజులమ్మను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి బుధవారం పరామర్శించారు. నల్లగొండగ్రామంలో రాజులమ్మ ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. కొద్ది రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బంది ఉన్నా సమాచారం ఇవ్వాలని, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం తరలిస్తామన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, సత్యనారాయణ, నేతలు సుధాకర్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను సత్కరిస్తున్న సీఆర్‌టీలు

సీఆర్‌టీయూ నేతల హర్షం

సాక్షి, పాడేరు: తమ సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉద్యోగాల రెన్యువల్‌కు కృషి చేసిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు సీఆర్‌టీయూ నాయకులు బుధవారం ఆయన నివాసగృహంలో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సీఆర్టీల రెన్యువల్‌పై ప్రభుత్వం తీసుకున్న హర్షణీయమన్నారు. నాయకులు భానుమూర్తి, కోటేశ్వరరావు, మహేష్, అశోక్, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

రైతు గ్రూపులకు పూర్తి సహకారం

- కలెక్షన్ సెంటర్లను పరిశీలించిన రాష్ట్ర ఉద్యావన శాఖ జేడీ హనుమంతరావు



గొండుపాలెంలో కలెక్షన్ సెంటర్ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న జేడీ హనుమంతరావు

కె.కోటపాడు: రైతులు గ్రూపులుగా ఏర్పడి వ్యవసాయం చేస్తే ఉద్యానవన శాఖ ద్వారా పూర్తి సహకారాన్ని అందించనున్నట్లు రాష్ట్ర ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ పి.హనుమంతరావు అన్నారు. కె.కోటపాడు మండలం కె.సంతపాలెం, గొండుపాలెం, కింతాడ గ్రామాల్లో ఉద్యావనన శాఖ సహకారంతో నిర్మిస్తున్న కలెక్షన్ సెంటర్ల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటి ఏర్పాటు వల్ల సంఘంలో రైతులు పంటల అమ్మకాలు, నిల్వలు చేసుకోవచ్చన్నారు. గతంలో పంటను నిల్వ ఉంచలేని పరిస్థితిలో తక్కువ ధరకే అమ్మకాలు చేసుకునే వారని వాపోయారు. దీంతో పంటకు మద్దతు ధర పొందని పరిస్థితి ఉండేదన్నారు. వీరి ఇబ్బందులకు కొంత వరకైనా పరిష్కారం చూపేందుకు ఈ భవనాల నిర్మాణాన్ని రాయితీపై రుణాన్ని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ జిల్లాలో 29 రైతు సంఘాలకు రాయితీపై కలెక్షన్ సెంటర్, కోల్డ్ స్టోరేజీల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ నిర్మాణాలు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నట్లు వివరించారు. ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సభ్యులు లాలం అచ్చుంనాయుడు, బండారు దేముళ్లు, రెడ్డి నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా గరగ మహోత్సవం



గరగల ఊరేగింపులో భక్తులు

రావికమతం: కొత్తకోట మోదకొండమ్మతల్లి మహోత్సవం ఈ నెల 11న నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా బుధవారం సతకంపట్టు నుంచి గరగ తీసి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శానాపతి అప్పారావు, సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లిరూరల్: చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ వెంకటరమణ చెప్పారు. విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు, లంబసింగి సబ్‌స్టేషన్‌లో రంగులు వేయ డం తదితర కారణాల వల్ల విద్యుత్ కోత విధిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.